సాక్షి
అనంతపురం
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



10న యువ న్యాయవాదుల సదస్సు
అనంతపురం జేఎన్‌టీయూలో ఈ నెల 10న యువ న్యాయవాదుల సదస్సు నిర్వహించనున్నారు. 8లో



టమాట కిలో రూ.15
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/17.3°
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

10 వరకు 'తత్కాల్' కింద ఇంటర్ ఫీజు చెల్లించొచ్చు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు తత్కాల్ స్కీం కింద ఈ నెల 10 వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తత్కాల్ స్కీం కింద రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుందని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణ నాయక్ తెలిపారు.

అత్యాచారం చేయబోతే అంతమొందించింది!



బొగ్గు ప్రతాప్ మృతదేహం

ధర్మవరం రూరల్: తనపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిని ఓ మహిళ రోకలి బండతో మోదింది. తీవ్రగాయాలైన అతడు ఆస్పత్రిలో ప్రాణాలు విడిచాడు. సీఐ అశోక్‌కుమార్ తెలిపిన మేరకు.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బొగ్గు ప్రతాప్ (35), కేతిరెడ్డి కాలనీకి చెందిన స్నేహలతలు ఒకే కళాశాలలో ఇంటర్ చదివారు. కొంత కాలం క్రితం బొగ్గు ప్రతాప్ భార్య మృతి చెందింది. ఈ క్రమంలోనే ప్రతాప్ కేతిరెడ్డి కాలనీలో ఉన్న స్నేహలత ఇంటికి వెళ్లేవాడు. ఆమె భర్త, కుటుంబ సభ్యులు మందలించినా ప్రతాప్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఆదివారం పూటుగా మద్యం సేవించి స్నేహలత ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె భర్త ఇంట్లో లేడు. దీంతో ఆమెను బలాత్కారం చేయడానికి ప్రయత్నించగా.. ఆగ్రహించిన స్నేహలత ఇంట్లో ఉన్న రోకలి బండతో ప్రతాప్ తలపై మోది అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయాన్ని స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రక్తపు మడుగులో ఉన్న ప్రతాప్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి ఒక కుమార్తె ఉంది. స్నేహలతను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

డ్రోన్ ఆపరేటింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో డ్రోన్ ఆపరేటింగ్ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 19 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణత, డిగ్రీ, ఇంజినీరింగ్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులు. మూడు నెలల పాటు కొనసాగే ఈ శిక్షణ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. శిక్షణ సమయంలో మధ్యాహ్నం భోజనం ఉచితం. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అసెస్‌మెంట్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారు. ఉద్యోగాలూ కల్పిస్తారు. కోర్సులో భాగంగా డ్రోన్ అసెంబ్లింగ్, మెయింటెనెన్స్, సర్వీసింగ్, డ్రోన్ ఫ్లయింగ్, డ్రోన్ ద్వారా డేటా సేకరణ, నిఘా అంశాలపై శిక్షణ ఇస్తారు. పూర్తి వివరాలకు 99401 98805, 97909 57378లో సంప్రదించవచ్చు.

పేదలకు 'స్థిరాస్తి'

పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుగా మారాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. సొంతింటి కల సాకారం చేసేందుకు పక్కాగృహాలు మంజూరు చేసింది. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం చేపట్టింది. జిల్లా అంతటా సచివాలయాల వద్ద రిజిస్ట్రేషన్ల కోలాహలం కనిపిస్తోంది.

- యజ్ఞంలా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- ఆస్తిపై సంపూర్ణ హక్కు కల్పిస్తున్న ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 97,570 మంది లబ్ధిదారులు
- సెలవు దినం ఆదివారమూ కొనసాగిన రిజిస్ట్రేషన్లు





అనంతపురంలో లబ్ధిదారులతో కిటకిటలాడుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం, యాడికి మండలం కమలపాడు లక్ష్మీదేవికి ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: పేదలకు స్థిరాస్తి కల్పించడం చరిత్రాత్మకమైన ఘట్టం. పేదల ఇళ్ల పట్టాలకు జగన్ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కు కల్పిస్తోంది. జిల్లావ్యాప్తంగా లబ్ధిదారుల పేరిట ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ యజ్ఞంలా సాగుతోంది. ఆదివారం సెలవు దినమైనా సచివాలయాల్లోనే కాకుండా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగింది. ప్రభుత్వం తమ పేరున ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి హక్కు కల్పిస్తుండడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

97,570 మంది లబ్ధిదారులు..

'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం కింద జిల్లాలో 97,570 మంది ఇళ్ల పట్టాలు పొందారు. ఇందులో 64,205 ప్లాట్ల మ్యాపింగ్ పూర్తయ్యింది. 33,365 ప్లాట్ల మ్యాపింగ్ జరగాల్సి ఉంది. మ్యాపింగ్ పూర్తయిన ప్లాట్లకు సంబంధించి 56,276 స్థలాలకు హద్దులు చూపించారు. 7,929 స్థలాలకు హద్దులు చూపాల్సి ఉంది. ఇప్పటి వరకు అన్ని ప్రక్రియలు పూర్తి చేసి రిజిస్ట్రేషన్ కోసం 47,627 ప్లాట్లను ధ్రువీకరించారు. మ్యాపింగ్, హద్దుల నిర్ధారణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు నిరంతరంగా సాగుతూనే ఉంటాయి. రోజువారీ పురోగతిని అధికారులు సమీక్షిస్తుంటారు.

ఆనందంగా ఉంది



మాలాంటి పేదలకు ఇంటి స్థలం మంజూరు చేయడమే కాకుండా ఆ స్థలాన్ని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. మాకంటూ ఒక స్థిరాస్తిని కల్పించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.
– ఈశ్వరమ్మ, బుక్కరాయసముద్రం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



పేదలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటోంది. ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ప్లాటును రిజిస్ట్రేషన్ చేసి దానిపై పూర్తిహక్కు కల్పించడం చాలా మంచి కార్యక్రమం. పేదల బతుకులకు భరోసా నిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
– హుసేన్‌బీ, వైఎస్సార్ కాలనీ, కురుగుంట, అనంతపురం రూరల్ మండలం

పకడ్బందీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ



ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో పకడ్బందీగా జరుగుతోంది. రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభించి రెండు రోజులయ్యింది. ఆదివారం కూడా రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ రెండు రోజుల వ్యవధిలో 322 రిజిస్ట్రేషన్లు జరిగాయి. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనూ సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల సంఖ్య క్రమేణా పుంజుకోనుంది.
– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్



'సాయి మాటే..ప్రేమ బాట' నృత్య రూపకంలో ఘట్టం

సాయి తత్వం.. ప్రేమ మయం

- ప్రశాంతి నిలయంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఉమ్మడి కరీంనగర్ భక్తులు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు దంపతులు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన భక్తులకు జీవనోపాధులకు ఉపయోగపడే టైలరింగ్ యంత్రం, ఎలక్ట్రీషయన్, ప్లంబింగ్ కిట్లను పంపిణీ చేశారు సాయంత్రం బాలవికాస్ చిన్నారులు 'సాయి మాటే ..ప్రేమ బాట' పేరుతో సంగీత నృత్యరూపకం నిర్వహించారు. సత్యసాయి మహిమాన్విత ఘట్టాలను అత్యద్భుతంగా ప్రదర్శించారు.



జీవనోపాధుల కిట్లను పంపిణీ చేస్తున్న రత్నాకర్ రాజు

'సిద్ధం' సభకు స్థల పరిశీలన




రాప్తాడులో బహిరంగ సభ స్థలం ఎంపికపై మాట్లాడుతున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి

రాప్తాడు: ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి రాప్తాడులో ఈ నెల 10న నిర్వహించే బహిరంగ సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. బహిరంగ సభ కోసం ఆదివారం సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్/ ఎమ్మెల్సీ తలశిల రఘురాం.. ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త శాంత, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి స్థల పరిశీలన చేశారు. రాప్తాడులోని ఆటో నగర్ సమీపాన స్థలాన్ని, రామినేపల్లి సమీపంలోని ఎంఐజీ లేఅవుట్‌ను, ప్రసన్నాయపల్లి సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర కుమార్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, పార్టీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకుడు చిత్రా వెంకటేష్ పాల్గొన్నారు.

17 నుంచి కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు

- 24న శ్రీవారి రథోత్సవం





కొండపై వెలసిన శ్రీవారి మూలవిరాట్, ఉత్సవాలకు సిద్ధమైన కొండమీదరాయుని ఆలయం

బుక్కరాయసముద్రం: మండలంలోని కొండమీద రాయ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. కొండపైకి వెళ్లేందుకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చొరవతో రూ.4 కోట్లు వెచ్చించి సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపులా హైమాస్ లైట్లు ఏర్పాటు చేశారు. 17న సాయంత్రం బీకేఎస్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను కొండపైకి చేరుస్తారు. 18న ఉదయం 8 గంటలకు దేవరకొండపై ఉత్సవ మూర్తులకు పుణ్యాహవచనము, అంకురార్పణ, దేవతాహోమాలు, ధ్వజారోహణం, గరుడ ఆహ్వాన పూజలు ఉంటాయి. అదే రోజు రాత్రి 8గంటలకు పూలపల్లకీ సేవ ఉంటుంది. 19న రాత్రి 8గంటలకు సింహ వాహనం, 20న రాత్రి 8గంటలకు శేష వాహనం, 21న రాత్రి 8గంటలకు హనుమద్వాహన సేవలు ఉంటాయి. స్వామి వారి వాహన సేవల్లో అత్యంత కీలకమైన గరుడ వాహన సేవను ఈ నెల 22న రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నారు. 23న రాత్రి 8గంటలకు శ్వేతగజ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమివ్వనున్నారు.

24న కల్యాణోత్సవం..

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసే కల్యాణోత్సవాన్ని ఈ నెల 24న వేకువజాము 4 గంటలకు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై దేవేరులతో కలసి శ్రీవారు ఊరేగనున్నారు. గరుడాద్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి పురవీధుల గుండా ఎంతో అట్టహాసంగా ఈ ఊరేగింపు సాగనుంది. మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం ఉంటుంది. 25న రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఊరేగిస్తారు. 26న ఉదయం 7గంటలకు తీర్థవాది వసంతోత్సవం నిర్వహించి రాత్రి7 గంటలకు హంస వాహన సేవలు ఉంటాయి.

ఆరోగ్యం పదిలం



'జగనన్న ఆరోగ్య సురక్ష'లో వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

- విజయవంతంగా ఆరోగ్య సురక్ష 2.0
- జనవరి 2 నుంచి ప్రారంభమైన మెడికల్ క్యాంపులు
- 180 క్యాంపుల్లో 81 వేల మందికి పైగా వైద్య సేవలు

అనంతపురం మెడికల్: ప్రజల ఆరోగ్యంపై జగన్ సర్కారు దృష్టి పెట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకొచ్చింది. ఈ ఏడాది జనవరి రెండో తేదీ నుంచి ఆరోగ్య సురక్ష 2.0 ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి, అవసరమైన చికిత్సలు అందించి ఆరోగ్యవంతులను చేస్తోంది.

దిగ్విజయంగా 180 క్యాంపులు పూర్తి..

కలెక్టర్ గౌతమి ఆదేశాలతో డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పర్యవేక్షణలో ఆరోగ్య సురక్ష 2.0లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 180 వైద్య శిబిరాలు దిగ్విజయంగా పూర్తి చేశారు. ఆ ప్రాంతాల వైద్యాధికారులతో పాటు చిన్నపిల్లల, గైనకాలజిస్టు, ఆప్తమాలజిస్టు తదితర స్పెషలిస్టు వైద్యులు శిబిరాలకు వచ్చిన ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 81,276 మంది ఓపీ సేవలు పొందారు. అందులో సాధారణ ఓపీ సేవలు 76,270 మంది పొందారు. వీరిలో 37,024 మంది పురుషులు, 39,246 మంది మహిళలు ఉన్నారు. 5,006 మందికి వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. మొత్తం అన్ని రోగాలకు సంబంధించి 126 మందిని జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఇదిలా ఉండగా గతేడాది జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష 1.0 (మొదటి దశ)లో 2,23,474 మంది ఓపీ సేవలు పొందారు. వారిలో 3,562 మందిని జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేశారు. 3,695 మందికి కంటి శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు. ఆరోగ్యశ్రీ కింద 678 మందికి చికిత్సలందించారు. 2,23,474 మందికి హైపర్ టెన్షన్ చెకప్‌లు, 2,23, 474 మందికి మధుమేహ, 91,418 మందికి రక్త పరీక్షలు చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన వస్తోంది. జిల్లాలోని వివిధ సచివాలయాల పరిధిలో విడతల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు రోగులను పరీక్షించి, సమస్యలున్న వారిని జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ప్రజలు శిబిరాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.
– డాక్టర్ భ్రమరాంబ దేవి, డీఎంహెచ్‌ఓ

బీడు భూముల్లో ఇంధనం

- ఉమ్మడి జిల్లాలో సోలార్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
- రాయదుర్గం ప్రాంతంలో ఇప్పటికే పూర్తయిన భూసేకరణ
- ముదిగుబ్బ, రాప్తాడు మండలాల్లో వేగం పెంచిన నెడ్‌క్యాప్



సోలార్ ప్లాంట్ ప్రతీకాత్మక చిత్రం



డీ హీరేహాళ్ సమీపంలోని బీడు భూమి

రాయదుర్గం: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలోనే రైతుల చెంతకు వ్యవసాయ సేవలను తీసుకొచ్చింది. విత్తనం మొదలు పంట దిగుబడుల మార్కెటింగ్ వరకు సాయమందిస్తోంది. మరో వైపు వ్యవసాయం చేసే పరిస్థితులు లేక భూములు బీడు పెట్టుకున్న రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో బీడు భూములు కలిగిన రైతులకు ఇంధన రంగం ద్వారా శాశ్వత ఉపాధి మార్గం చూపేందుకు ముందుకొచ్చింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో రూ.12,065 కోట్ల వ్యయంతో 3,350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు మంత్రి మండలి కూడా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు ఏర్పాటైతే ప్రత్యక్షంగా 3,300 మంది, పరోక్షంగా మరో పది వేల మందికి ఉపాధి లభించనుంది.

నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో భూసేకరణ..

సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమయ్యే భూములను నెడ్‌క్యాప్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తోంది. నెడ్‌క్యాప్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామసభలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. రాయదుర్గం నియోజకవర్గంలోని డీ హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం మండలాల్లో ఇప్పటికే 15 వేల ఎకరాలు గుర్తించారు. అందులో 6,750 ఎకరాలకు రైతుల నుంచి అంగీకారం తీసుకున్నారు. ప్రస్తుతం డీ హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయి. అదనంగా మరో 2,250 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఇన్వెస్టర్లను ఒప్పించేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు.

- ఇదిలా ఉండగా రాప్తాడులో 1,050 మెగావాట్లు, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బలో 1,050 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణ ప్రక్రియను నెడ్‌క్యాప్ ప్రతినిధులు ముమ్మరం చేశారు.

30 ఏళ్ల లీజుతో సుస్థిర ఆదాయం..

సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటైతే బీడు భూములకు మహర్దశ కలగనుంది. రైతుల అంగీకారం మేరకు 30 ఏళ్ల పాటు లీజు అగ్రిమెంట్‌తో నెడ్‌క్యాప్ ఒప్పందం చేసుకోనుంది. సాధారణంగా రైతు గుత్త (కౌలు)కు ఇస్తే ఎకరా రూ.5వేల నుంచి రూ.8 వేలకు మించదు. అలాంటిది ఎకరాకు రూ.25 వేల చొప్పున లీజు ధర నిర్ణయిస్తే, రైతు సంక్షేమం దృష్ట్యా మరో రూ.5 వేలు పెంచి ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సంస్థ ప్రతినిధులను ఒప్పించింది. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.30 వేల చొప్పున రైతు ఖాతాకు నేరుగా జమ కానుంది. పంట పండినా ఇంత మొత్తం చూడటం సాధ్యం కాదని అన్నదాతలు అంటున్నారు. పైసా పెట్టుబడి లేకుండా రెండింతల సుస్థిర ఆదాయం లభిస్తుండడంతో చాలామంది రైతులు భూములు ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు.

రైతులు ముందుకు రావాలి



బీడు భూములు, వర్షాధారంగా అరకొరగా పంట పండే రైతులు ఈ మార్గాన్ని ఎంపిక చేసుకోవడం ఉత్తమం. ఐదు ఎకరాలున్న రైతు కూడా పైసా పెట్టుబడి లేకుండా ఏడాదికి రూ.1.50 లక్షలు పొందవచ్చు. భూములు ఇవ్వడానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. దీనివల్ల ప్రయోజనం తెలిశాకే అంగీకారం పొందవచ్చు.
– రాణీ సుస్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

రాయదుర్గం రూపురేఖలు మారుస్తాం



రాయదుర్గం ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్ది రూపురేఖలు మార్చుతాం. పేదరికం శాశ్వతంగా దూరం చేసేలా కృషి చేస్తాం. ఇప్పటికే జాజరకల్లు వద్ద రూ.533 కోట్ల వ్యయంతో ఇథనాల్ ఇంధన తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఆమోదం లభించింది. తాజాగా సోలర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 3వేలకు పైగా మెగావాట్ల సోలర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా ఇన్వెస్టర్లను ఒప్పిస్తాం. రైతులు భూములిచ్చేందుకు ముందుకొచ్చి ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సోలార్ ప్లాంట్లలో స్థానికులకే ఎక్కువ శాతం ఉద్యోగ అవకాశాలు దక్కేలా కృషి చేస్తాం.
– మెట్టు గోవిందరెడ్డి, ఏపీఐఐసీ ఛైర్మన్

మౌలిక వసతులు మెరుగు..

సోలర్ పరిశ్రమల ద్వారా వచ్చే ఆదాయంలో రెండు శాతం సీనరేజ్ నిధులను సమీప గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది. తద్వారా రైతు, కూలీల జీవనోపాధికి తోడు గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. వలస మాటే లేకుండా సొంతూళ్లలోనే వేలాది మంది నిరుద్యోగులు, కూలీలకు ఉపాధి లభించనుంది. దీంతో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని ఇద్దరి మృతి




రామాంజనేయులు (ఫైల్), మృతుడు రాజు

ఉరవకొండ: కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు గ్రామానికి చెందిన రామాంజనేయులు (48), రాజు బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం వీరు ఉరవకొండలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. ఉరవకొండ మండలం బూదగవి గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా బళ్లారి వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుతో పాటు కారులో ప్రయాణిస్తున్న బళ్లారి వాసులు అభిషేక్, శుక్లా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక రాజు (38) మృతి చెందాడు. మృతుల్లో రామాంజనేయులుకు భార్య రామలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజుకు భార్య నాగవేణి, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కాలుజారి పడి వృద్ధుడి ..

గుత్తి: స్థానిక కోట వీధిలో నివాసముంటున్న సత్తార్(67) ప్రమాదవశాత్తు బాత్రూమ్‌లో కాలుజారి పడి మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాత్రూమ్‌లో కాలకృత్యాలు తీర్చుకుంటున్న సమయంలో కాలుజారి కింద పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'సిద్ధం' విజయవంతం చేద్దాం

- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే అనంత పిలుపు



పార్టీ శ్రేణులతో కలసి పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 10న రాప్తాడు నియోజకవర్గంలో జరిగే ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభను విజయవంతం చేద్దామంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం అనంతపురం నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. మంచి చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గద్దె దింపడమే లక్ష్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన కుట్ర పూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మైండ్ గేమ్‌లో భాగంగా ప్రభుత్వంపై వారి అనుకూల పత్రికలు, మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వీరెన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. ఇటీవల నిర్వహిస్తున్న ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో ఇదే విషయం తేటతెల్లమైందన్నారు. జగనన్న ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. ప్రజాభీష్టం మేరకు జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకునేందుకు అందరూ కలసి కట్టుగా పనిచేయాలన్నారు. మనం ఒక ప్రయత్నం చేస్తే ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో జరిగిన 'సిద్ధం' సభలు విజయవంతమయ్యాయని, అదే కోవలో ఈ నెల 10న జరగనున్న సభనూ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభ ముందు రోజున జిల్లా కేంద్రంలోని వివిధ డివిజన్ల పరిధిలో ర్యాలీలు నిర్వహించి సభ ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరుస్తూ బహిరంగ సభలో పాల్గొనేలా సన్నద్ధం చేయాలన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ... రానున్న ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థ నాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, గూడూరు మల్లికార్జున, అబూసలేహ, బాలాంజినేయులు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, సాకే చంద్ర, సుమతి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, కృష్ణవేణి, క్లస్టర్ అధ్యక్షులు మధు, రమణారెడ్డి, ఓబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, బండి శ్రీకాంత్, రాధాకృష్ణ, అనిల్‌కుమార్‌గౌడ్, లక్ష్మణ్, రామయ్య, జావేద్, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఏపీఎల్ విజేత మడకశిర, అనంత




మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న అల్తాఫ్, యోగానంద

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా జరుగుతున్న సీనియర్ ఏపీఎల్ టోర్నీ విజేతగా అనంతపురానికి చెందిన ఫ్యామిలీ క్లబ్, మడకశిర క్రికెట్ క్లబ్ జట్లు నిలిచాయి. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో తొలుత అనంతపురం ఫ్యామిలీ క్లబ్, ఏడీసీఏ గుంతకల్లు జట్లు తలపడ్డాయి. నిర్ణీత 20 ఓవర్లలో ఫ్యామిలీ క్లబ్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 176 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంతకల్లు జట్టు 20 ఓవర్లలో 162 పరుగులకే పరిమితమైంది. ఫ్యామిలీ క్లబ్ జట్టులో యోగానంద 42 బంతుల్లో 60 పరుగులు చేసి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

= మడకశిర క్రికెట్ క్లబ్, విక్కీ ఎలెవన్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విక్కీ ఎలెవన్ జట్టు 19.4 ఓవర్లలో 73 పరుగుల వద్ద చతికిలపడింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మడకశిర జట్టు 11.4 ఓవర్లలోనే 75 పరుగులు చేసి విజయం సాధించింది. మడకశిర జట్టులో బౌలర్ అల్తాఫ్ కేవలం 8 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు దక్కించుకుని మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నాడు.

10న యువ న్యాయవాదుల సదస్సు

- హాజరు కానున్న ముగ్గురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు హైకోర్టు న్యాయమూర్తులు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) వేదికగా ఈ నెల 10న యువ న్యాయవాదుల సదస్సు (వర్క్‌షాప్ ఫర్ యంగ్ అడ్వకేట్స్) నిర్వహించనున్నారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, విశిష్ట అతిథులుగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, మరో జడ్జి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి హాజరుకానున్నారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్‌కుమార్ మిశ్రా, ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి, జస్టిస్ బి.శ్యామసుందర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ ఎస్.ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ అపూర్వకుమార్ శర్మ, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్ చైర్మన్ రామజోగేశ్వర రావు, అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విశ్వనాథరెడ్డి హాజరు కానున్నారు. ఒకే సదస్సుకు సుప్రీంకోర్టు జడ్జిలు ముగ్గురు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు హైకోర్టు న్యాయమూర్తులు హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'సివిల్ ప్రొసీజర్ కోడ్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు డిస్పోజల్ ఆఫ్ ఇంటర్లొక్యూటరీ అప్లికేషన్స్' అనే అంశంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అలాగే 'రిలవెన్స్ ఆఫ్ అడ్మిషన్స్ అండ్ కన్ఫెషన్స్ ఇన్ ఏ క్రిమినల్ ట్రయల్' అంశంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు, 'అప్లికేషన్ ఆఫ్ ఎవిడెన్స్ ఇన్ క్రిమినల్ లా' అంశంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, 'ఇంపార్టెన్స్ ఆఫ్ ఎథిక్స్ ఇన్ లీగల్ ప్రొఫెషన్' అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, 'ఎఫెక్టివ్ కోర్టు రూమ్ అడ్వొకసీ' అంశంపై సుప్రీం కోర్టు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, 'రూల్ ఆఫ్ లా అండ్ రోల్ ఆఫ్ అడ్వకేట్స్ ఇన్ బిల్డింగ్ ప్రాస్పెరస్ భారత్' అంశంపై జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి అవగాహన కల్పించనున్నారు.

వృద్ధుడి బలవన్మరణం



మృతుడు సుబ్బరాయుడు

గార్లదిన్నె: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం అనగానదొడ్డికి చెందిన సుబ్బరాయుడు(64) గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యామ్‌కు చెందిన లక్ష్మీదేవిని పెళ్లి చేసుకున్నాడు. పెనకచెర్ల డ్యామ్‌లోనే స్థిరపడి వ్యవసాయంతో జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో గుత్తిలో స్థిరపడాలని నిర్ణయించుకున్న ఆయన ఇటీవల అక్కడ ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. రెండు రోజుల క్రితం భార్య లక్ష్మీదేవితో గొడవపడిన ఆయన శనివారం నేరుగా పెనకచెర్లడ్యామ్‌కు చేరుకుని తన తోటకెళ్లి మద్యంలోకి పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని సుబ్బరాయుడు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి బేల్దారి మృతి



ఎర్రిస్వామి (ఫైల్)

పామిడి: రైలు కిందపడి ఓ బేల్దారి మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... పామిడిలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన వడ్డే ఎర్రిస్వామి (47) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. అవివాహితుడైన ఆయన కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ ఇంటి నుంచి బయటకెళ్లిన ఎర్రిస్వామి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం స్థానిక ఎద్దులపల్లి మార్గంలోని రైలు పట్టాలను ట్రాక్‌మెన్ పరీక్షిస్తూ వెళుతుండగా సత్రం సమీపంలో దుర్వాసన వస్తుండడం గమనించి పరిశీలించాడు. పట్టాల పక్కన గుంతలో కుళ్లిన స్థితిలో ఉన్న పురుషుడి మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఎర్రిస్వామి కుటుంబసభ్యులు అనుమానంతో అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడిని ఎర్రిస్వామిగా నిర్ధారించారు. ఘటనపై మృతుడి తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జనవాక్కు


కులవృత్తులను ఆదరించారు



కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని గతంలో ఏ ప్రభుత్వమూ గుర్తించలేదు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి బతుకులు ఎంతో బాగుపడ్డాయి. బార్బర్ షాపులు నిర్వహిస్తున్న మాకు జగనన్న చేదోడు పథకం కింద ఏటా రూ.10 వేలు లబ్ధి చేకూరింది. షాపులకు కరెంట్ బిల్లు లేదు. ఏటా వచ్చే రూ.10 వేలను పెట్టుబడిగా పెట్టి నా షాప్‌ను అభివృద్ధి చేసుకున్నా. కుల వృత్తులను ఆదరించి, మాకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌ను ఎన్నటికీ మరువం. ఆయనకు మద్దతుగా నిలుస్తాం.

– మురళి, కూడేరు

పింఛన్ మంజూరైంది



కాంగ్రెస్ హయాంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర రెడ్డి ఉన్నప్పుడు నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ అందకుండా చేశారు. జాబితాలో నుంచి నా పేరు తొలగించి, వారికి అనుకూలమైన వారికి మంజూరు చేయించుకున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక చాలా సార్లు అధికారులను కలసి ప్రాధేయపడ్డాను. అయినా ఎవరూ నా గోడు పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి నా కష్టాన్ని తెలుసుకుని నాకు పింఛన్ వచ్చేలా చేశాడు. గతంలోలా కాకుండా 1వ తేదీ వస్తే చాలు ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ డబ్బు ఇచ్చి వెళుతున్నాడు. ఇంత గొప్ప ముఖ్యమంత్రిని ఇప్పటి వరకూ నేను చూడలేదు. ముసలోళ్లను కన్నబిడ్డలా ఆదుకున్న వైఎస్ జగన్ మరో పది కాలల పాటు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా.

– సంజమ్మ, ఆత్మకూరు

చాలా పథకాలు అందుకున్నా



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కుటుంబానికి చాలా పథకాలు వర్తించాయి. గతంలో ఎన్నడూ ఇంతలా సంక్షేమ పథకాలను అందుకున్నది లేదు. గార్లదిన్నె గురుకుల పాఠశాలలో చదువుతున్న నా కుమారుడికి అమ్మ ఒడి పథకం, నా భార్య దేవమ్మకు రైతు భరోసా పథకం, మా అమ్మ తిప్పమ్మకు పింఛన్ కానుక తదితర పథకాలు అందాయి. వీటి కోసం నేను ఎవరినీ ప్రాధేయపడింది లేదు. మా అర్హతను గుర్తించి ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పథకాల లబ్ధి చేకూర్చాడు. సీఎం వైఎస్ జగన్ వెంటే మా కుటుంబం ఉంటుంది.

– వెంకటేష్‌నాయక్, ఎస్‌ఎస్‌పీ తండా, వజ్రకరూరు మండలం

జగనన్న ప్రభుత్వంలోనే లబ్ధి



టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల లబ్ధి పొందాలనుకుంటే ఆ పార్టీ కండువాలు కప్పుకోమనేవారు. జన్మభూమి కమిటీ సభ్యులతో సిఫారసు చేయించుకుని రండి అని అధికారులు వెనక్కు పంపేవారు. దీంతో టీడీపీ హయాంలో నయా పైసా కూడా లబ్ధి చేకూరలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాకు ఇంటి స్థలం వచ్చింది. పక్కా గృహ నిర్మాణం చేసిచ్చారు. నా పిల్లలకు అమ్మ ఒడి పథకం వర్తించింది. మా అమ్మకు వైఎస్సార్ ఆసరా పథకం వచ్చింది. అర్హత ఉండడంతో చాలా పథకాల లబ్ధి చేకూరింది. జగనన్న రుణం తీర్చుకోలేనిది. ఇలాంటి నాయకుడే మళ్లీ సీఎం కావాలి.

– శ్రీరాములు, ఆత్మకూరు

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి

కుందుర్పి: మండలంలోని అల్లాపురం-కనుకూరు రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో కర్ణాటకకు చెందిన వాసుపాల్‌శర్మ(45) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని కొర్లకుంట గ్రామం నుంచి బసాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో చేరుకున్న వాసుపాల్ శర్మ ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. అల్లాపురం గ్రామం దాటిన తర్వాత ఎదురుగా బైక్‌పై దూసుకొచ్చిన శెట్టూరు మండలం కనకూరు గ్రామానికి చెందిన సురేష్ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వాసుపాల్‌శర్మను స్థానికులు వెంటనే కర్ణాటకలోని చిత్రదుర్గం ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. ఘటనపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

గార్లదిన్నె: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం పాత కల్లూరుకు చెందిన సాంబశివుడు (37) ఆదివారం ఉదయం రైస్‌మిల్లులో పని కోసం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా 44వ జాతీయ రహదారిపై వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లిపోయాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. ఘటనపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నం కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన మేరకు... ఆమిద్యాలకు చెందిన రవి, రోజా ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఇరువైపులా కుటుంబపెద్దలు వీరి ప్రేమను అంగీకరించకపోవడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. దీంతో అప్రమత్తమైన కుటుంబపెద్దలు ఇద్దరికీ వేర్వేరు వ్యక్తులు వివాహం చేశారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన యువకుడిని పెళ్లి చేసుకున్న రోజా... ఏడు నెలల క్రితం భర్తతో ఘర్షణ పడి పుట్టింటికి చేరుకుంది. రాజాను ఎలాగైనా పెళ్లి చేసుకోవాలనుకున్న ఆమె ఆ మేరకు విశ్వ ప్రయత్నాలు చేసింది. ఈ నేపథ్యంలోనే తాము పెళ్లి చేసుకున్నా.. కుటుంబపెద్దలు తమను ప్రశాంతంగా జీవనం సాగనివ్వరని భయపడిన ఇద్దరూ ఆదివారం ఉదయం గ్రామ శివారులోని పొలానికి చేరుకుని పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితికి చేరుకున్న ప్రేమజంటను అటుగా వెళ్లిన కూలీలు గమనించి 108 అంబులెన్స్ ద్వారా తొలుత ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై సీఐ తిమ్మయ్య మాట్లాడుతూ.. తమకు ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఘటనకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేస్తే ఇద్దరి స్టేట్‌మెంట్ రికార్డు చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు.

నేషనల్ ఫ్రిస్‌బీ టోర్నీ విజేత ఎయిర్ బెండర్స్



విజేత ఎయిర్‌బెండర్స్ జట్టు



రన్నరప్‌ను దక్కించుకున్న ఎయిర్‌బోర్న్ జట్టు

అనంతపురం: నేషనల్ ఫ్రిస్‌బీ టోర్నీ విజేతగా బెంగళూరుకు చెందిన ఎయిర్‌బెండర్స్ జట్టు నిలిచింది. అనంత క్రీడాగ్రామం వేదికగా అల్టిమేట్ ఫ్రిస్‌బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బెంగళూరుకు చెందిన ఎయిర్ బెండర్స్ వన్, ఎయిర్‌బోర్న్ జట్లు తలపడ్డాయి. 15-13 పాయింట్ల తేడాతో ఎయిర్ బెండర్స్ జట్టు టైటిల్ గెలుచుకుంది. మొత్తం జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది క్రీడాకారులు టోర్నీలో పాల్గొన్నారు. అల్టిమేట్ ఫ్రిస్‌బీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పుండ్రీకుమార్, అంతర్జాతీయ మాజీ క్రీడాకారిణి నిత్య, అల్టిమేట్ ఫ్రిస్బీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి దీపక్, మాజీ భారత్ కోచ్ నందన్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పుండ్రీకుమార్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా జాతీయ స్థాయి ఫ్రిస్‌బీ టోర్నీ నిర్వహించేందుకు ఆర్డీటీ అద్భుతమైన సౌకర్యాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు


అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి బంగారు కవచంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కాలసర్పదోష నివారణ కొరకు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి పూజలు నిర్వహించి, మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీత నందితను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

అనంతపురం కల్చరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. అధిక సంఖ్యలో రోగులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, అసిపుద్దీన్, నబీరసూల్, ఉమా మహేశ్వరి మాట్లాడుతూ మొత్తం 227 మంది కంటివైద్య శిబిరానికి హాజరుకాగా, 148 మందికి ఉచితంగా ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా రాష్ట్రస్థాయి అవార్డునందుకున్న జేఎన్‌టీయూ విద్యార్థిని నందితను సత్కరించారు.

మౌనగిరి క్షేత్రాన్ని సందర్శించిన జర్మనీ దేశస్తులు


39 అడుగుల అభయాంజనేయ స్వామి సన్నిధిలో జర్మనీ దేశస్తులు

రాప్తాడు: హంపాపురం 44వ జాతీయ రహదారి సమీపంలో ఉన్న మౌనగిరి క్షేత్రాన్ని జర్మనీ దేశస్తులు ఆదివారం సందర్శించారు. జర్మనీ ఇండో ప్రాజెక్టులో భాగంగా హంపాపురంలో జరిగిన వాటర్ షెడ్ పనులను సందర్శించడానికి వచ్చిన జర్మని దేశస్తులు మంత్రి క్రిష్టోఫ్, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ కంట్రి మేనేజర్ జోస్కు మౌనగిరి క్షేత్రానికి వచ్చారు. మౌనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు ఈశ్వరయ్యస్వామి కుమారుడు మధు పూర్ణ కుంభంతో వారికి ఆహ్వానం పలికారు. మౌనగిరి క్షేత్రంలోని 39 అడుగుల ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని సన్మానించారు. స్వామి చిత్ర పటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో జర్మనీ దేశస్తులు సంగీత అగర్వాల్, రాజీవ్, వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.4.22 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.22 లక్షలు ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏ.ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.37 లక్షలు, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,85,200 మేర వసూలైనట్లు తెలిపారు.

నిక్ ఉబిజిస్ ప్రసంగాలు స్ఫూర్తిదాయకం


నిక్‌ఉబిజిస్ ప్రసంగాల కరపత్రాలనందిస్తున్న పాస్టర్ కిశోర్

అనంతపురం కల్చరల్: నిక్ ఉబిజిస్ ప్రసంగాలు స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. నగరంలోని బిలీవర్స్ చర్చిలో ఈనెల 5న సాయంత్రం కర్నూలు నగరంలో జరగనున్న ప్రఖ్యాత ఇన్నోవేటివ్ ప్రసంగీకులు నిక్‌ఉబిజిస్ కార్యక్రమ కరపత్రాలు, ఆహ్వాన పత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. పాస్టర్స్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు నెహమ్యా నాగరాజు, వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షులు రాజశేఖర్, సామాజిక సేవా కార్యకర్త చల్లా కిశోర్, పాస్టర్లు మనుష్యే, మార్క్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు చర్చిలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. పలు విద్యాసంస్థల వారికి నిక్‌ఉబిజిస్ జీవితాన్ని తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు చర్చిల సంఘ కాపరులు డేనియల్, సాల్మన్, జాషువా, ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

పెత్తందార్లపై యుద్ధానికి పేదలు సిద్ధం


మహిళా సంఘాలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: పేదల జీవితాలు బాగుండాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యం.. కుల, మత,రాజకీయలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.. మరో రెండు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయి..ఇది పేదలు, పెత్తందార్లకు జరుగుతున్న యుద్ధం..తాము ఎప్పుడు పేదలవైపే ఉంటూ మంచికి నిలబడతామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

పైప్‌లైన్లకు భూమి పూజ..

ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, తాము ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి రూ.95 కోట్లతో పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కూడేరు మండలం పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు మండలం, అనంతపురం రూరల్ మండలాలకు పైప్‌లైన్ల ద్వారా శాశ్వత నీటి సమస్య పరిష్కరిస్తున్నామన్నారు. మరో రెండు నెలల్లోపు తుంగభద్ర జలాలు తెస్తామన్నారు. పరిటాల కుటుంబం ఏనాడూ ప్రజా సమస్యలపై పట్టించుకున్న పాపానపోలేదన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదన్నారు.

చంద్రబాబు నిలువునా మోసం చేశాడు..

రుణమాఫీ పేరుతో చంద్రబాబు నాయుడు మహిళలను నిలువునా మోసం చేశాడని ఎమ్మెల్యే విమర్శించారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా నాల్గో విడత మండల వ్యాప్తంగా 679 సంఘాల్లోని 6,546 సభ్యులకు గాను రూ.4.48 కోట్లు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ యాదవ్, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్, మదిగుబ్బ వీరాంజి, బాలస్వామిరెడ్డి, ఫణిరెడ్డి, నాగరాజు, వన్నూరప్ప, నరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, తైదుల శివారెడ్డి,బాబయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు ,వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న ఆసరా

కనగానపల్లి (చెన్నేకొత్తపల్లి): గతంలో డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి టీడీపీ అధినేత చంద్రబాబు ఆడ పడుచులను మోసం చేస్తే, వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక సీఎం జగన్ రూ.25,500 కోట్ల రుణాలు మాఫీ చేసి అక్కచెల్లెమ్మలకు ఆసరాగా నిలిచారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చెన్నేకొత్తపల్లి మండలంలోని బసంపల్లిలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ శాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వైకేపీ ఏసీ రామేశ్వరరెడ్డి, చెన్నేకొత్తపల్లి ఎంపీపీ మజ్జిగ అంజలీ, జెడ్పీటీసీ సభ్యుడు మెట్టు గోవిందురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, నాయకులు కనుముక్కల రాజారెడ్డి, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డ్వాక్రా సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనన్నే రావాలి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే గ్రామీణ ప్రాంతాలు కూడా మరింత అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ముట్టాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

బాధితులకు పరామర్శ :

ఆత్మకూరుకు చెందిన తిరుమలరెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ బంధూక మధును పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, ముట్టాల సర్పంచ్ తిరుపాలమ్మ, ఎంపీటీసీ చిట్టెమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముత్యాలరెడ్డి, మాదన్న, గోవింద్, నరసింహులు, రాము నాయక్, అమర్‌నాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఫణిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సుశీలమ్మ, అక్కులప్ప, రవి, పోతన్న, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే మహిళా సాధికారత


మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శాంతమ్మ

- 'వైఎస్సార్ ఆసరా' సభలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే మహిళా సాధికారత సాధ్యమైందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 31 లక్షల మంది మహిళలకు ఇంటిపట్టాలు ఇవ్వడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసిందన్నారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో పాపంపేట, కక్కలపల్లికాలనీ, కట్టకిందపల్లి, ఆలమూరు పంచాయతీల పొదుపు సంఘాల మహిళలకు 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో 2 కోట్ల ఇళ్లు కట్టాలని ప్రధాని మోదీ నిర్ణయిస్తే, అందులో 22 లక్షల ఇళ్లను మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తున్నారన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి, అధికారంలో కొచ్చిన చంద్రబాబు.. ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి జగనన్న అండగా నిలిచారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాల ద్వారా 125 సార్లు బటన్ నొక్కి రూ. 2.53 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు.

17 వేల ఇళ్లు మంజూరు..

రాప్తాడు నియోజకవర్గంలో 17 వేల ఇళ్లను మంజూరు చేశామని ఎమ్మెల్యే అన్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుంచి కూడా రూరల్ మండలానికి తాగు నీళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేయలేదన్నారు. ఎన్నికల లోపు పీఏబీఆర్ రిజర్వాయర్ నుంచి తుంగభద్ర జలాలు ప్రతి ఇంటికీ ఇచ్చి ఈ ప్రాంత వాసులను ఓట్లు అడుగుతానని స్పష్టం చేశారు. రూరల్ మండలంలో దుర్మార్గంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసిన టీడీపీ వాళ్లపై యుద్ధం చేస్తున్నా అన్నారు. రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారితో యుద్ధం చేస్తున్నానని, నేనుంత వరకూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తానన్నారు. అనంతరం పొదుపు సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు నాగేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు కె. రాధమ్మ, గోవిందరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, సర్పంచ్ తేజస్విణి, నాయకులు ఆకుల మునిశంకరయ్య, మాదన్నయాదవ్, డాక్టర్ శీనా, ఈశ్వరయ్య, కొడిమి పవన్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన పొదుపు సంఘాల సభ్యులు

జాతి గర్వించదగ్గ నేత కర్పూరి ఠాకూర్


అభివాదం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

అనంతపురం టవర్‌క్లాక్: భారత జాతి గర్వించదగ్గ నేత కర్పూరి ఠాకూర్ నాయీబ్రాహ్మణ కుటుంబంలో జన్మించడం గర్వకారణమని నాయీ బ్రాహ్మణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి తెలిపారు. ఆదివారం స్థానిక జయ మునెమ్మ కల్యాణ మంటపంలో జన నాయక్ కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించిన సందర్భంగా నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట రంగయ్య అధ్యక్షత హించారు. ముఖ్య అతిథులుగా ఆర్టీటీ చైర్మన్ తిప్పేస్వామి, నాయీబ్రాహ్మణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య సమరంలో కర్పూరి ఠాకూర్ పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయినప్పటికీ నిరాడంబరంగా ఉండేవారన్నారు. అలాంటి మహనీయుడు శత జయంతి సందర్భంగా భారతరత్న ప్రకటించడం యావత్ జాతి గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు ప్రసాద్, కార్పొరేటర్ శేఖర్ బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు సుబ్రమణ్యం, శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, శ్రీనివాసులు, శ్రీధర్, నాగరాజు, సత్యనారాయణమ్మ, శివప్రసాద్, బండి నాగరాజు, ఉషాదేవి, అన్నపూర్ణమ్మ, హనుమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతు హల్ చల్

అనంతపురం: నగరంలో ఓ తాగుబోతు ఆదివారం రాత్రి హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో క్లాక్ టవర్ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులపై రాళ్లతో దాడి చేయడంతో భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు వాహనదారులు ధైర్యం చేసి తాగుబోతును పట్టుకొని చితకబాదారు. అయితే కొందరు అతను మతిస్థిమితం లేని వ్యక్తిగా చెప్తున్నారు.

ఆకట్టుకున్న జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు


విజేతలుగా నిలిచిన చిన్నారులతో నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆదివారం వివిధ స్థాయిల్లో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఫైన్ ఆర్ట్స్ ఆర్గనైజర్ మాస్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో కేఎస్ఆర్ కళాప్రాంగణంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి తరలి వచ్చిన చిత్రకారులు సమకాలీన, సందర్భోచిత అంశాలతో గీచిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీనియర్ విభాగంలో బెంగళూరుకు చెందిన వైష్ణవి ప్రథమ స్థానం దక్కించుకుంది. నగరానికి చెందిన నాగమణి , సత్యసాయి జిల్లా కదిరికి చెందిన నవీన్‌కుమార్ రెండు స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో బత్తలపల్లికి చెందిన జగదీష్‌నాయక్, కదిరికి చెందిన ప్రవీణ్, అనంతకు చెందిన దీక్షిత వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరయ్య, అంజన్ రెడ్డి, ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఉదయ్‌కుమార్, ఆదర్శ ఫైన్ ఆర్ట్స్ సిబ్బంది వినోద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మంటపం ఉచితం

అనంతపురం టవర్‌క్లాక్: కురుబ కుల గురువులు, గణాచార్యులు, పూజారుల పిల్లల పెళ్లిళ్లకు కల్యాణ మంటపం ఉచితంగా ఇవ్వనున్నట్లు కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు తుప్పటి ఈశ్వరయ్య తెలిపారు. ఆదివారం స్థానిక కనకదాస కల్యాణమంటపంలో కురుబ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ కురుబల కుటుంబాలు అభివృద్ధి చెందాలని కుల గురువులైన గణాచార్యులు, పూజార్ల పిల్లల పెళ్లిళ్లకోసం కల్యాణమంటపం ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి విఠల్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణయ్య, కోశాధికారి శీనయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శివబాల, కనకదాస కల్యాణ మంటపం మేనేజ్‌మెంట్ సభ్యులు పావురాల జగదీష్, బండి కాశి పాల్గొన్నారు.

సచివాలయాలతోనే సేవలు చేరువ

- దరఖాస్తు చేసుకుంటే చాలు.. సత్వరమే మంజూరు
- పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సేవలు
- ప్రజల ముంగిటకే పాలన తెచ్చిన జగనన్న


రాప్తాడు గ్రామ సచివాలయం

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజలు ప్రతి పనికీ మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.. పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. పల్లెల్లోనే సచివాలయాల ద్వారా అన్ని సేవలూ అందిస్తున్నారు. సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే చాలు... అధికారులు సత్వరమే పనులు చేస్తున్నారు. రాప్తాడు మండలంలో 11 సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం సేవలు అందిస్తోంది.మండల కేంద్రాలకు వెళ్లే పని లేకుండా ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, ఉన్న ఊరిలోనే సకల సేవలు అందిస్తున్నారు. సచివాలయాల్లో ఈ–సేవలు అందుబాటులోకొచ్చాయి. ప్రజలు ఏదైనా ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయంలో అర్జీని పెట్టుకుంటే 30 నిమిషాల నుంచి 72 గంటల్లో వాటిని అందిస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన సేవలన్నీ పారదర్శకంగా అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 550 రకాలకు పైగా సేవలు అందుతున్నాయి. ఆయా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్ల సహాయంతో ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారు. కులం, ఆదాయం, ఆధార్, ఈకేవైసీ, పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, అడంగల్, ఎఫ్ఎంబీ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నూతన రేషన్ కార్డులు, ఈసీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్స్, విద్యుత్ బిల్లులు, ప్రాపర్టీ ట్యాక్స్ కట్టించుకోవడం తదితర సేవలను ప్రజలకు అందిస్తున్నారు. జనన, మరణ, నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ దగ్గర నుంచి పాసుపుస్తకం, రేషన్ కార్డు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఎన్ఓసీ తదితర ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందిస్తున్నారు. కరెంటు బిల్లులను సైతం ఇక్కడే చెల్లించొచ్చు.

ఇబ్బందులు తొలగిపోయాయి



సచివాలయ వ్యవస్థ అందుబాటులోకొచ్చిన తర్వాత ఇబ్బందులు తొలగిపోయాయి. ఏ అవసరమైనా వలంటీర్‌ను పిలిచి అడిగితే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తున్నారు. సంక్షేమ పథకాలు నిర్ణీత గడువులోపు అందుతున్నాయి. గతంలో పనుల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధలేమీ లేవు.

– మన్నల రవికుమార్, రామినేపల్లి, రాప్తాడు మండలం

ఆఫీసుల చుట్టూ తిరిగే పని తప్పింది



గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రజలు మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పింది. గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి ఆయా శాఖల కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల్లోనే అన్ని శాఖల సేవలు అందుబాటులో ఉండడంతో ఏ సర్టిఫికెట్ అయినా సులభంగా లభిస్తోంది.

– బుడగ నాగరాజు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

నేత్రపర్వంగా శోభాయాత్ర


నగర వీధుల్లో సాగుతున్న అమ్మవారి శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: జగజ్జననిగా పూజలందుకునే ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీమాత నవకుండీ యాగం సందర్భంగా పాతూరు వీధుల్లో వందలాది మందితో శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పండుగ వాతావరణంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ పరిసరాలంతా కాషాయ జెండాలు, అరటి పట్టలు కట్టి అమ్మవారికి విశేష అలంకార సేవలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి నామస్మరణతో పవిత్ర కలశాలను తలపై ధరించిన మహిళలు, వివిధ దేవతామూర్తుల వేషధారణల్లో చిన్నారులు అందరిలో ఆధ్యాత్మికతను నింపారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల విడుదల


ఉత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న సర్పంచ్ పార్వతి తదితరులు

బుక్కరాయసముద్రం: దేవరకొండపై ఈ నెల 17 నుంచి జరగబోయే కొండమీద రాయుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను సర్పంచ్ పార్వతి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఈఓ రమేష్ బాబు మాట్లాడుతూ మండల కేంద్రంలో కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 24న కొండమీద రాయుని కల్యాణోత్సవం, తిరునాల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా సాహిత్యోత్సవం


మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ జాతీయ సెక్రటేరియట్ సభ్యుడు అఫ్జల్ రషీద్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం మన్నీల్ క్రాస్‌లోని యాసీన్ కాలేజ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్‌లో రెండు రోజుల పాటు సున్నీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) సాహిత్యోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముగింపు వేడుకలకు ఎస్ఎస్ఎఫ్ జాతీయ సెక్రటేరియట్ సభ్యుడు అఫ్జల్ రషీద్ కుత్బి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నైపుణ్యాలను పెంపొందించడానికి నిర్వహించిన సాహిత్యోత్సవ్‌లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గుంతకల్లు, అనంతపురం, ఆలూరు డివిజన్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో హాఫీజ్ కబీర్ నయీమి, సయ్యద్ మిద్లాజ్ ఖాదిరి, కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ సాబ్, రషీద్ అహ్మద్, స్వాలిహ్ అదానీ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Prl. Senior Civil Judge, Anantapuramu.

E.P. No: 71/2020 in O.S No. : 24/2007

Between :

M/s. Margadarsi Chit Fund Pvt Ltd., Kadapa Rep. by its Manager Cum Foreman ... D.Hr

and

V.Vijaya lakshmi and Others .... J.Drs

J.Dr No. 01 & 05 @ Order 21 Rule-43,64 & 66 Notice

J.Dr.No.01: V.Vijaya lakshmi W/o V.Venkateswara prasad Alias Venkatesh R/o H.No. 19/1-49A, Vinayaka nagar, old Town, Anantapur.

J.Dr.No.05: V.Venkateswara prasad Alias Venkatesh S/o. V.Krishnamurthy Achari R/o H.No. 19/1-49A, Vinayaka nagar, old Town, Anantapur

పిటీషనరు బాకీ మొత్తం రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన E.P. లో 1 & 5 వ J.Drs. అయిన మీరు **19-02-2024వ తేదిన** హాజరగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం **ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట ఖుద్దున మీరు గాని మీ తరపున వకీలు గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బోయపాటి రాజశేఖర్, D.Hr అడ్వకేటు, అనంతపురము. సెల్. 9440289779.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో కలిసిన 1987-88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1987–88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయక కలయిక ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ కలిసి, కబుర్లు చెప్పుకొని సరదాగా గడిపారు. పాఠశాల ఆవరణలో తాము చదివిన రోజులను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యను బోధించిన గురువులకు శాలువాలు కప్పి పూల మాలలతో సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం గ్రూప్ ఫొటో తీయించుకున్నారు.